'రాష్ట్రంలో కాంగ్రెస్ గెలుపు ఖాయం'


మెట్టు సాయికుమార్‌ను సత్కరించిన రఘు గౌడ్, ప్రవీణ్, మంజునాథ్

అబిడ్స్: సీఎం రేవంత్‌రెడ్డి సంక్షేమ పథకాలతోనే హైదరాబాద్ సికింద్రాబాద్‌లతో పాటు రాష్ట్రంలో అత్యధిక ఎంపీ స్థానాలు కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంటుందని రాష్ట్ర ఫిషర్‌మెన్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ పేర్కొన్నారు. పదేళ్ల మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి దివాల తీస్తే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అభివృద్ధి పథకంలో తీసుకువెళ్తుందన్నారు. చైర్మన్ మెట్టు సాయికుమార్‌ను గుడిమల్కాపూర్ శివ్‌బాగ్ ఆలయం తరఫున రఘుగౌడ్, ప్రవీణ్, మంజునాథ్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ..బేగంబజార్ ఫిష్ మార్కెట్‌తో పాటు నగరంలోని ఇతర ఫిష్ మార్కెట్లను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్‌ఎస్‌లకు డిపాజిట్లు దక్కే పరిస్థితి లేదని మెట్టు సాయికుమార్ పేర్కొన్నారు.

నేడు వసంత నవరాత్రి ఉత్సవాలకు అంకురార్పణ

- బ్రహ్మోత్సవాలకు త్రివేణి సంగం ముస్తాబు
- రెండవ భద్రాద్రిగా భక్తుల నమ్మకం
- రామలక్ష్మణులు స్వయంగా విడిది చేసిన పవిత్ర పుణ్యస్థలం

లంగర్‌హౌస్: వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలకు లంగర్ హౌస్‌లోని ఈసా, ముచుకుంద, గుప్త గంగల కలయిక త్రివేణి సంగం ముస్తాబయ్యింది. నేటి నుంచి వసంత నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. స్వయంగా రామలక్ష్మణులు మారువేషంలో వచ్చి రెండు రోజులు విడిది చేసిన పవిత్ర పుణ్యక్షేత్రం లంగర్‌హౌస్ త్రివేణి సంగం ఒడ్డున వెలసిన మఠ ఆలయం జానకీ సమేత వీరవెంకట విజయ రాఘవ స్వామి ఆలయం. ఈ మఠ ఆలయంలో శ్రీరామ నవమి పురస్కరించుకొని 10 రోజుల పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. నేడు శ్రీ క్రోధి నామ తెలుగు నూతన సంవత్సర ప్రారంభం మంగళవారం ఉగాది పర్వదినాన బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేయనున్నారు. ప్రతిరోజూ వివిధ అలంకారాల్లో సీతారాములు ముస్తాబు అయ్యి వివిధ రూపాల్లో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఉత్సవాల నిర్వహనకు ఏర్పాట్లు పూర్తయ్యాయని పీఠాధిపతి రాహుల్‌దాస్ బాబా తెలిపారు.


సీతారాముల కల్యాణం (ఫైల్)

బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టాలు..

సంగం మఠ ఆలయం జానకీ దేవి, విజయ రాఘవ స్వామి వార్లకు నిర్వహించే వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నేడు తెలుగు నూతన సంవత్సరం శ్రీక్రోధి నామ సంవత్సర ప్రారంభం, ఉగాది పర్వదినాన ఉదయం 6 గంటలకు మూల విరాట్‌లకు ప్రత్యేక పంచామృతాభిషేకాలు నిర్వహిస్తారు. 9 గంటలకు సుదర్శన హోమం ప్రారంభం, సాయంత్రం 4 గంటలకు హవనం, రాత్రి 7 గంటలకు సహస్ర దీపారాధన పల్లకీ ఉత్సవం ఉంటాయి. 13న శనివారం సాయంత్రం సామూహిక శ్రీనివాస కల్యాణ మహోత్సవం అనంతరం నారయణి రూపంలో కొలువుదీరిన శ్రీనివాసున్ని గరుడ వాహనంపై ఊరేగిస్తారు. 14న ఆదివారం లక్ష్మీనరసింహస్వాముల కల్యాణం, అనంతరం భారీ హనుమాన్ వాహనంపై స్వామి వారు ఊరేగుతూ భక్తులకు దర్శనమివ్వనున్నారు. 16న సీతారాములకు సాయిటెక్ ముత్యాల శేఖర్ బాబు, మామిడాకుల క్రిష్ణ నివాసాల్లో మంగళస్నానాలు నిర్వహిస్తారు. అనంతరం సంగం ఆలయంలో వసంతోత్సవం సీతారాములను పెళ్లి కుమారుడు, పెళ్లి కూతుర్లుగా ముస్తాబు, తలంబ్రాలు కలపడం నిర్వహించనున్నారు.

“ అన్ని ఏర్పాట్లు చేశాం..



పవిత్ర పుణ్యక్షేత్రం సంగం మఠంలో వైష్ణో సాంప్రదాయం ప్రకారం ప్రతి సంవత్సరం నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారు. ఎలాంటి టికెట్లు, వీఐపీ టికెట్లు కూడా లేకుండా అందరికీ సరిసమానంగా చూస్తూ ఏర్పాట్లు చేస్తాం. కల్యాణ కంకణ ధారణ అందరికీ చేయించి భక్తులందరూ ప్రత్యక్ష కల్యాణంలో పాల్గొనే విధంగా ఏర్పాట్లు చేశాం.

– 1008 రాహుల్‌దాస్ బాబా, సంగం పీఠాధిపతులు

వంద శాతం ఓటు హక్కును వినియోగించుకోవాలి


అవగాహన కల్పిస్తున్న కమిషనర్ రోనాల్డ్ రాస్, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

చార్మినార్: ఈసారి జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో వంద శాతం ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్, జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్ కోరారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా సోమవారం సాయంత్రం ఇఫ్తార్ విందు సమయంలో మక్కా మసీదులో ఓటరు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓటరు–ఓటు హక్కు–దాని ప్రాధాన్యత తదితర అంశాలపై ఓటర్లకు అవగాహన నిర్వహించారు. చేతుల్లో ప్ల కార్డులు పట్టుకుని ఈ ఎన్నికల్లో తాను తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకుంటాననే నినాదాలు చేయించి ప్రదర్శన నిర్వహించారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు ఎంతో విలువైందనే విషయాలను మక్కా మసీదులో ఇఫ్తార్ విందుకు హాజరైన ప్రజలకు వివరించారు. జాయింట్ సీఈఓ సర్ఫరాజ్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తదితరులతో కలిసి ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనం వేసే ఓటు మన భవిష్యత్తును నిర్దేశిస్తుందన్నారు. మే 13న జరిగే పోలింగ్‌లో ఓటు హక్కు ఉన్న ప్రతి ఓటరు పాల్గొనాలన్నారు. జాయింట్ సీఈఓ సర్ఫరాజ్ మాట్లాడుతూ..ఓటరు లిస్టులో తమ పేరు లేకపోతే ఈ నెల 15వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ..హైదరాబాద్‌లో ఓటింగ్ శాతం పెంచేందుకు స్వీప్ ద్వారా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులతో పాటు జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్న పాల్గొన్నారు.

తెలంగాణలో 17 ఎంపీ స్థానాల్లో పోటీ చేస్తాం


మాట్లాడుతున్న అధ్యక్షురాలు రచ్చ సుభద్రారెడ్డి

సుల్తాన్‌బజార్: పార్లమెంటు ఎన్నికల్లో ఏ పార్టీతో పొత్తు లేకుండా తెలంగాణలో 17 ఎంపీ స్థానాల్లో పోటీ చేస్తామని సోషలిస్ట్ పార్టీ (ఇండియా) అధ్యక్షురాలు రచ్చ సుభద్రారెడ్డి అన్నారు. నల్గొండ, భువనగిరి రెండు పార్లమెంటు స్థానాల నుంచి తాను బరిలో నిలుస్తున్నట్లు పేర్కొన్నారు. సోమవారం హైదర్‌గూడలోని ఎన్‌ఎస్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె 10 మంది ఎంపీ అభ్యర్థుల జాబితా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..కుల నిర్మూలన సమ సమాజ నిర్మాణం సోషలిస్ట్ పార్టీ లక్ష్యం అన్నారు. యువతను మహిళలను ముందుకు తీసుకెళ్లే దిశగా పార్టీ పనిచేస్తుందన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ అన్ని పార్టీలు అవినీతిమయమైపోయాయన్నారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో తమ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించి ఎంపీ టికెట్ కేటాయిస్తామని పేర్కొన్నారు. బీవీ రమేష్‌బాబు–చేవెళ్ల, అంబి హనుమంతరావు–హైదరాబాద్, సునీతారాణి–సికింద్రాబాద్, గట్టు రాణాప్రతాప్ గౌడ్–కరీంనగర్, లక్పతినాయక్–మహబూబాద్, కనకయ్యా–పెద్దపల్లి, రాయిస్ అన్వర్–ఖమ్మం, గాలి రాజు పూలే–నాగర్‌కర్నూల్, గాలి దుర్గాబాయి–వరంగల్ స్థానాల నుంచి పోటీ చేస్తారని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ మహిళా కన్వీనర్ ప్రొఫెసర్ డాక్టర్ సుమిత్రారాయ్, ప్రధాన కార్యదర్శి హనుమంతరావు, డాక్టర్ ఎంపీ రమణ, ఉపాధ్యక్షులు డి.లిలాగోపాల్, బీవీ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య శ్రీ సేవలు మరింత పెరగాలి

గోల్కొండ: ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆరోగ్య శ్రీ సేవలు మరింత పెరగాలని గోల్కొండ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ మజహరుల్లా అన్నారు. సోమవారం గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో ఆయన వివిధ విభాగాల వైద్యులు, వైద్య సిబ్బందితో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా గత వారం వివిధ ప్రభుత్వ ఆసుపత్రుల వైద్యులు, ఆరోగ్య శాఖ అధికారులతో జరిగిన సమావేశంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ఆరోగ్య శ్రీ పథకం అమలుపై ప్రత్యేకంగా ఆదేశాలు ఇచ్చారని ఆయన గుర్తుచేశారు. ఆసుపత్రికి వచ్చే రోగులంతా తమవెంట ఆరోగ్య శ్రీకి అవసరమైన రేషన్ కార్డు తేవాలని స్పష్టం చేయాలన్నారు. తెలంగాణలో ప్రభుత్వం మారిన తర్వాత ఆరోగ్య శ్రీ పథకం ప్రయోజనాలు కూడా పెరిగాయని ఆర్థిక పరిమితి కూడా పెరిగిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఏవో శ్రీనివాసరావు, వివిధ విభాగాల వైద్యులు, వైద్య సిబ్బంది ఉన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ మహ్మద్ మజహరుల్లా

పండుగలను శాంతియుతంగా నిర్వహించుకోవాలి


మాట్లాడుతున్న డీసీపీ రావుల గిరిధర్

సుల్తాన్‌బజార్: పండుగలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని ఈస్ట్‌జోన్ డీసీపీ రావుల గిరిధర్ సూచించారు. సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో జాంబాగ్‌లోని వీవీ ఫంక్షన్‌హాల్‌లో పీస్ కమిటీ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీసీపీ రావుల గిరిధర్ హాజరై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. హనుమాన్ జయంతి, శ్రీరామ నవమి, రంజాన్ పండుగలను మతసామరస్యంతో నిర్వహించుకోవాలని ఆయన సూచించారు. ఈ ర్యాలీలలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ బందోబస్తును నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సుల్తాన్‌బజార్ ఏసీపీ శంకర్, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసచారి, నారాయణగూడ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, లింగేశ్వర్‌తో పాటు ఎస్ఐలు కిరణ్‌కుమార్‌రెడ్డి, నరేష్, మధుసూదన్, సతీష్, శ్వేత, పీస్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'హైదరాబాద్ పార్లమెంటు సీటు మాదే'


కార్వాన్ యూత్ వాయిస్ మీట్‌లో మాధవీలత

గోల్కొండ: ఈసారి హైదరాబాద్ సీటు గెలిచేది బీజేపీనే అని ఆ పార్టీ అభ్యర్థి మాధవీలత అన్నారు. సోమవారం కార్వాన్‌లో క్రాంతి భవన్‌లో జరిగిన యూత్ వాయిస్ మీట్‌లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె యువకులతో కలిసి గోమాత చిత్రపటాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో యువకుల పాత్ర, రాజకీయాల్లో యువత ఎలా రాణించాలి అనే అంశంపై ఆమె యువకులకు వివరించారు. బీజేపీ గత పదేళ్లల్లో ప్రధాని మోదీ సారథ్యంలో సాధించిన విజయాలు, ఆర్థికంగా, శాస్త్ర సాంకేతిక రంగాల్లో దేశం సాధించిన పురోగతి తదితర విషయాలను మారుమూల ఓట్లకు సైతం చేరవేయాల్సిన అవసరం ఉందన్నారు. కొత్తగా నమోదైన ఓటర్లతో పాటు సీనియర్ సిటిజన్లను సైతం పోలింగ్ బూత్‌లకు తేవాలని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు యువకులు తమ అనుమానాలను, సందేహాలను ఆమె ముందు ఉంచారు. వాటన్నిటిని వివరించి సంతృప్తి పరిచారు. ఈ కార్యక్రమంలో కేసరి హనుమాన్ యువ సంఘటన్ అధ్యక్షుడు అద్దాల కార్తీక్, గంజి రఘునాథ్, రక్షిత్‌సాగర్, శశాంక్ సేనాపతి, రాజన్, లోకేష్, మహేష్, ప్రణయ్ తదితరులున్నారు.

ప్రత్యేక పూజలు


పూజలు నిర్వహిస్తున్న సంఘం ప్రతినిధులు, భక్తులు

గౌలిపురా: గౌలిపురాలోని బతుమ్మ బావి సమీపంలోని లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం ఆర్యవైశ్య సంఘం లాల్‌దర్వాజా గౌలిపురా ఆధ్వర్యంలో పరమశివునికి విశేష పూజలు, రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం ఛత్రినాక పాత పోలీస్‌స్టేషన్ వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ శ్రీరాం కోటయ్య గుప్తా, సలహాదారులు సరాబు విశ్వేశ్వరయ్య, అధ్యక్షుడు శ్రీధర మల్లికార్జున్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి సరాబు సంతోష్‌గుప్తా, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇరుకుల్ల భిక్షపతి, సభ్యులు పడకంటి వెంకటేశం, శివ, శిరంగి, సంతోష్, పోల జగన్నాథం, విశ్వనాథం పాల్గొన్నారు.

అహద్ హాష్మీకి గోల్డ్‌మెడల్



చార్మినార్: షంషీర్‌గంజ్‌లోని హబీబ్ ముస్తఫా బాక్సింగ్ అకాడమీకి చెందిన సయ్యద్ అహద్ హాష్మీ కంబైన్డ్ నేషనల్ టాలెంట్ హంట్ అండర్ 14 బాయిస్ బాక్సింగ్ టోర్నమెంట్‌లో మొదటి విజేతగా నిలిచి గోల్డ్ మెడల్ సాధించారు. గత నెల 30వ తేదీ నుంచి ఈనెల 6వ తేదీ వరకు హరియాణాలో జరిగిన టోర్నమెంట్‌లో సయ్యద్ అహద్ హాష్మీ అస్సాం, మహారాష్ట్ర, ఢిల్లీ, తమిళనాడులకు చెందిన పోటీదారులను 33–35 కిలోల బరువు కేటగిరిలో ఓడించి విజేతగా నిలిచినట్లు అకాడమీ కోచ్ మహ్మద్ హబీబ్ ముస్తఫా తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

సుల్తాన్‌బజార్: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం సుల్తాన్‌బజార్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ.కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం..కుబ్దిగూడకు చెందిన సురేందర్ (46) డాక్యుమెంట్ రైటర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆర్థిక ఇబ్బందులతో సోమవారం తెల్లవారుజామున ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకుని మృతి చెందాడు. ఉదయం కుటుంబసభ్యులు తలుపు తట్టగా ఎంతకు తెరవకపోవడంతో అనుమానం వచ్చిన తలుపులు విరగొట్టి చూడగా రవీందర్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని వేలాడుతూ కనిపించాడు. సమాచారం తెలుసుకున్న సుల్తాన్‌బజార్ పోలీసులు పంచనామ నిర్వహించి మృతదేహాన్ని స్వాధీనపరచుకుని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ఈ కేసు దర్యాప్తులో ఉంది.

వివాహం కావడం లేదని యువకుడు..

గౌలిపురా: ఉద్యోగంతో పాటు వివాహం కావడం లేదని తీవ్ర మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఇంట్లో చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ పి.నాగదుర్గా ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. లాల్‌దర్వాజా ప్రాంతానికి పి.కృష్ణ కుమారుడు పి.సందీప్ (29)కు ఉద్యోగంతో పాటు వివాహం కావడం లేదని తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. సందీప్ ఈనెల 7న రాత్రి తన గదిలోకి వెళ్లి తలుపులు పెట్టుకున్నారు. అనంతరం సోమవారం ఉదయం సందీప్ ఎంతకీ నిద్ర లేవకపోవడంతో కుటుంబ సభ్యులు తలుపులు తట్టి చూడగా ఎలాంటి స్పందన లేదు. దీంతో కిటికీలో నుంచి చూడగా..సందీప్ చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం ఉస్మానియా మార్చురీకి తరలించారు. తండ్రి కృష్ణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కార్వాన్‌లో కాంగ్రెస్ పటిష్టతకు కృషి


ఉస్మాన్ అలీని సన్మానిస్తున్న బొట్టు రామ్, అరుణ్‌కుమార్

జియాగూడ: కాంగ్రెస్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని పటిష్టపరిచి లోక్‌సభ ఎన్నికల అభ్యర్థి మంచి ఓటు బ్యాంకును అందిస్తానని కార్వాన్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి ఉస్మాన్ అలీ అన్నారు. సోమవారం కార్వాన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి నూతనంగా కాంగ్రెస్‌లో చేరిన సీనియర్ నాయకులు బొట్టు రామ్, తూంకుంట అరుణ్‌కుమార్ ఇన్‌చార్జ్ ఉస్మాన్ అలీని కలిసి ఆయనకు సన్మానించారు. అనంతరం సీనియర్ నాయకులు బొట్టు రామ తూంకుంట అరుణ్‌కుమార్ మాట్లాడుతూ..కార్వాన్‌లో కాంగ్రెస్ పూర్వ వైభవానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

'హైదరాబాద్‌లో రికార్డు సృష్టిస్తా'


సమావేశంలో హైదరాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్

అబిడ్స్: హైదరాబాద్ పార్లమెంట్‌లో మజ్లిస్, బీజేపీలను ఓడించి రికార్డు సృష్టిస్తానని హైదరాబాద్ పార్లమెంటు బీఆర్‌ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. గన్‌ఫౌండ్రీలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. పదేళ్లపాటు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం పాతబస్తీకి చేపట్టిన సంక్షేమం, ప్రగతి, అభివృద్ధితోనే విజయం సాధిస్తానన్నారు. మజ్లిస్ పార్టీ ఎప్పుడు మైనార్టీలకు అసత్య ప్రలోభాలు పెట్టి విజయం సాధించిన తర్వాత వారిని విస్మరించిందన్నారు. ఈ సమావేశంలో శీలం సరస్వతి, శ్రీనివాస్ యాదవ్, దిలిప్ ఘనాటే, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులు హైదరాబాద్ సంస్కృతికి ప్రతిబింబాలు


ఇఫ్తార్ విందులో అక్బరుద్దీన్ ఒవైసీ, ఎమ్మెల్యే కౌసర్ తదితరులు

గోల్కొండ: ఇఫ్తార్ విందులు హైదరాబాద్ నగర సంస్కృతికి ప్రతిబింబాలని మజ్లిస్ శాసన సభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ అన్నారు. సోమవారం గోల్కొండ డివిజన్‌లోని మోతీదర్వాజా చౌరస్తా వద్ద మజ్లిస్ నాయకులు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇఫ్తార్ విందుల ఏర్పాటులో యువకులే కీలక పాత్ర పోషించడం అభినందించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్, మజ్లిస్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు హారూన్‌ఫారన్, వజీఉజ్ జమా, అమీరుద్దీన్, న్యాయవాది మిర్జా ఎక్బాల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

వెబ్‌సైట్ ఆవిష్కరణ



గన్‌ఫౌండ్రీ: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఇంటీరియల్ డిజైనింగ్ సేవలందిస్తున్న ఎస్‌కేఎస్ మాడ్యులర్స్ నూతన వెబ్‌సైట్‌ను సోమవారం మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అత్యున్నత సేవలను అందించడం అభినందనీయమని కొనియాడారు. సంస్థ అధ్యక్షుడు బైరి శ్రీకాంత్‌గౌడ్ మాట్లాడుతూ..15 ఏళ్ల అనుభవంతో అన్ని రకాల ఇంటీరియర్ డిజైనింగ్ సేవలను వినియోగదారులకు అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం గౌడ హాస్టల్ 72వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని రూ.30 వేలను విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో చక్రవర్తిగౌడ్, విజయ్‌కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవకే వాసవీ క్లబ్ అంకితం



అబిడ్స్: సమాజ సేవకే వాసవీ క్లబ్ హైదరాబాద్ అంకితమని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ పేర్కొన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం మహిళలకు చీరల పంపిణీతో పాటు అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్సీ దయానంద్ మాట్లాడుతూ..సమాజ సేవ చేయడంలోనే ఎంతో ఆనందం, సంతోషం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా 800 మంది భక్తులకు అన్నప్రసాదంతో పాటు మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు ఉప్పల వరకుమార్ గుప్తా, ప్రధాన కార్యదర్శి మంచాల అంబరీష్, క్లబ్ నాయకులు అడగుల వెంకటేష్, అనంతుల దయాకర్, పబ్బా శ్రీనివాస్, ప్రదీప్, అన్నప్రసాద దాత రాజేష్ కులావర్ పాల్గొన్నారు.